


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 300 | గురువారం 27 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం



## పత్తి రైతులకు గుడ్ న్యూస్.. సీసీఐకి అధికారులకు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం అటకెక్కలేదు -మహేశ్ కుమార్ గౌడ్



## ఎవరి ప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీ విస్తరణ..

### ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న



## నగరంలో ఫేక్ ఐఏఎస్ అధికారి అరెస్ట్

### బాధితుల నుంచి రూ.10 లక్షలు వసూలు




## మాదాపూర్‌లో బోర్డు తిప్పేసిన మరో ఐటీ కంపెనీ

### రోడ్డున పడ్డ 400 మంది



## ప్రజా పోరాటాలతో మీకు బుద్ధి చెప్తాం..

### సర్కారుపై తెలంగాణ జాగృతి చీఫ్ కవిత ఫైర్



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** సింగరేణి కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాలను కాపాడేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ దీర్ఘకాలం పోరాటం చేసినా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కుతోందని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో సర్కార్ వైఖరిపై బుధవారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాజాగా ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు లో మోసం జరిగిందని, 129 మంది రిటైర్మెంట్ సన్నాహక కార్మికుల్లో కేవలం 23 మందిని మాత్రమే అన్‌ఫిట్‌గా ప్రకటించి, మిగతా 106 మందిని అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ 106 మందిలో కూడా సీనియారిటీని పాటించకుండా 10 మందిలో ఒకరిగా మార్చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, ఆ 129 మంది కార్మికులు తాము రిటైర్ అయి తమ పిల్లలకు లేదా కావాల్సిన వారికి ఉద్యోగం ఇప్పించాలని కోరుకుంటున్నారని తెలిపారు. సింగరేణిలో యువ రక్తాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ.. తద్వారా తమ కుటుంబం బాగుంటుందని కార్మికులు భావించారని ఆమె అన్నారు.

## వారికి ఆ విషయం తెలియకపోవచ్చు

### ఆర్టీసీలో టికెట్ ధరల పెంపు ప్రచారం పై అధికారిక వివరణ



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** టీజీఎస్ఆర్టీసీ మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసు బస్సు టికెట్ ధరలను పెంచింది అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆర్టీసీ ఖండించింది. గతంలో 30 రూపాయలు ఉన్న దూరానికి ఇప్పుడు ఏకంగా రూ. 45 వసూలు చేస్తున్నారని ఒకేసారి రూ. 15 పెంచడం దారుణం అని ఈ విషయంలో ప్రతిపక్ష నేత కేటీఆర్ అసెంబ్లీ వేదికగా స్పందించాలంటూ ఓ నెటిజన్ చేసిన పోస్టు వైరల్ గా మారింది. ఈ పోస్టుపై కేటీఆర్ సైతం స్పందించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి వివరాల మేరకు ఈ విషయంలో తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ అధికారిక వివరణ ఇచ్చింది. ఈ వివరాల ప్రకారం ' సోషల్ మీడియా లో కొందరు తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు టికెట్ ధరలను పెంచింది అని ప్రచారం చేసారు. అందులో ఎలాంటి నిజం లేదు.ప్రస్తుత అవసరానికి అనుగుణంగా అక్టోబర్ 6, 2025 న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ నడిపే బస్సుల్లో టికెట్లపై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ విధించాం. కానీ ఆ తరవాత, తెలంగాణ లో ఆర్టీసీ నడిపే బస్సుల్లో ఎలాంటి టికెట్ ధరలను పెంచలేదు. సాధారణంగా, ఆర్టీసీ బస్సు టిక్కెట్ల ధరల పెరుగుదల డీజిల్ ధరకు నేరుగా అనుసంధానంగా పెరుగుతాయి.

# సర్పంచ్ ఎన్నికల్లో పోటీపై బీజేపీ సంచలన నిర్ణయం




- పంచాయతీ ఎన్నికల్లో పూర్తి స్థాయి పోటీకి బీజేపీ సిద్ధం
- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యూహాత్మక చర్చలు
- కాంగ్రెస్ పాలనపై బీజేపీ అసంతృప్తి గర్జనలు
- గ్రామాల అభివృద్ధికి కేంద్ర నిధులే ఆధారం: బీజేపీ
- పంచాయతీల నిర్వీర్యంపై కాంగ్రెస్‌ను నిలదీసిన బీజేపీ
- బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీల ద్వంద్వ వైఖరి మీద విమర్శలు
- కామారెడ్డి డిక్లరేషన్ పూర్తిగా బూటకమంటున్న బీజేపీ
- చీరల పంపిణీపై కాంగ్రెస్‌పై ఎన్నికల రాజకీయాల ఆరోపణలు

మిగతా 2 లో

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. వార్డు మెంబర్ స్థాయి నుండి జడ్పీటీసీ వరకు అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు పంచాయతీ ఎన్నికలపై ఇవాళ ఇవాళ బీజేపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ఈ సందర్భంగా రామచందర్ రావు అన్నారు.

## తెలంగాణలో రహదారుల అభివృద్ధికి బంగారు దశ మొదలైంది : మంత్రి కోమటిరెడ్డి



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** నల్గొండ పట్టణంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సాగర్ ఎక్స్‌రోడ్-దర్వేశిపురం ఫోర్ లైన్ రహదారి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సెంట్రల్ మీడియన్ మరియు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఈ ఆధునిక రహదారి పనులు వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

## జీవో 46 రద్దు చేయాలని

### ట్యాంక్‌బండ్‌పై బీసీల ఆందోళన



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** సుప్రీంకోర్టు ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 46 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం నాయకులు ట్యాంక్‌బండ్ వద్దఆందోళన చేపట్టారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లలో లోపాల కారణంగా కొన్ని మండలాల్లో బీసీలకు రిజర్వేషన్లు దక్కలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించిన బీసీ నాయకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్‌బండ్ రోడ్డుపై ధర్నాకు దిగారు.

## ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు.. హైకోర్టు కీలక ఆదేశాలు



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించిన తర్వాత, వాటిపై ప్రభుత్వం తరచుగా రాయితీలు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. వాహనాల రకాన్ని బట్టి 75 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తుంటారు. పేరుకుపోయిన పెండింగ్ చలాన్ల బకాయిలను రికవరీ చేసుకునేందుకు ప్రభుత్వం అప్పుడప్పుడు డిస్కౌంట్లు ఇస్తుంటుంది. ఇలా డిస్కౌంట్లు ప్రకటించడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ రాయితీలు ఇవ్వడం వలన చట్టపరమైన పరిణామాల పట్ల ప్రజల్లో ఉన్న భయం, గౌరవం బలహీనపడతాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా.. రాయితీలు ట్రాఫిక్ క్రమశిక్షణారాహిత్యాన్ని మరింత పెంచుతాయని, ప్రజలు నిబంధనలను ఉల్లంఘించినా ఏదో ఒక దశలో రాయితీ లభిస్తుందనే భావన పెరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది.

జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టిన ఈ కేసులో.. ఈ-చలానా వ్యవస్థలో అత్యవసరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ట్రాఫిక్ ఉల్లంఘన జరిగినప్పుడు అది ఏ చట్టంలోని ఏ సెక్షన్ కింద ఉల్లంఘనగా పరిగణించబడిందనే వివరాలను చలానా జారీ సమయంలో స్పష్టంగా పొందుపరచగలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలు, వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉందో సమగ్ర నివేదికను డిసెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు హోంశాఖను ఆదేశించింది. ఈ సాంకేతిక మెరుగుదల కేంద్ర మోటారు వాహన నిబంధన 167 ప్రకారం తప్పనిసరి అని న్యాయమూర్తి గుర్తు చేశారు.

## ఆడబిడ్డలకు చీరలు ఇస్తుంటే కేటీఆర్, హరీశ్ రావు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు: సీతక్క



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఓర్వలేకే బీఆర్ఎస్ విమర్శలు.. మంత్రి సీతక్క ఇందిరమ్మ చీరలపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేయడం తగదని మంత్రి సీతక్క అన్నారు. ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలని ఇస్తున్నామని, అయినా కలర్ బాగాలేదని, డిజైన్ బాగాలేదని బీఆర్ఎస్ వాళ్లు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. సహజంగానే ఆడవాళ్లు ఎదుగుతుంటే ఓర్వలేనితనం కేటీఆర్ , హరీశ్‌రావులదని విమర్శించారు. ఆడబిడ్డలు చీరలు తీసుకుని సంబరపడుతుంటే వారు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లాగా ఇవి సూరత్ నుంచి కిలోల లెక్కన తీసుకొచ్చిన చీరలు కాదని, సిరిసిల్ల నేతన్నలు తమ చేతితో స్వయంగా నేసిన చీరలని మంత్రి స్పష్టం చేశారు. కావాలంటే కేటీఆర్, హరీష్ రావు, కవిత స్వయంగా సిరిసిల్ల వెళ్లి నేతన్నలను వెళ్లి అడిగి తెలుసుకోవాలన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో పోటీపై బీజేపీ సంచలన నిర్ణయం

ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో పోటీ:

గత రెండు సంవత్సరాలలో పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మీడియాతో మాట్లాడిన ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యాచరణను రూపొందించడంపై ఇవాళ సమావేశం నిర్వహించామన్నారు. గ్రామ పంచాయతీలన్ని దివాళా తీసే పరిస్థితికి బీఆర్ఎస్ తీసుకువస్తే దాన్ని కొనసాగించింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రైతు వేదికలు, హరితహారం, శ్మశానవాటికలు ఏవి కట్టినా అవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులేనన్నారు. ఏ పని కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా కేటాయించలేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు కూడా డైవర్ట్ చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ దేనన్నారు. గ్రామీణ పేదలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని తేలిపోయింది:

కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని తేలిపోయిందని బీసీలను ఏ రకంగా మోసం చేయాలని నూటికి నూరు శాతం కాంగ్రెస్ మోసం చేసిందని కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. మహిళలకు పండగలకు చీరలను పెడతారు. కానీ ఇవాళ రాష్ట్రంలో తద్దినాలకు చీరలను పంచిపెడుతున్న పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు. రెండు బతుకమ్మ పండగలు పోయినా ఇవ్వని చీరలు గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందనగా హడావుడిగా పంపిణీ ప్రారంభించారని ఆరోపించారు. ఎలక్షన్స్ ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వెంటనే చీరలు పంచుతూ మున్సిపాలిటిల్లో మాత్రం పంచడం లేదని ఇదంతా ఎన్నికల కోసమే చేస్తున్నారని అర్థం అవుతోందన్నారు. చీరలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పంపిణీ చేస్తున్నారని ఈ చీరలకు నిధులు ప్రభుత్వం నుంచి కేటాయించారా లేక గాంధీ భవన్ నుంచి కేటాయించారా అని నిలదీశారు.

## భార్య చేతిలో మరో భర్త బలి..

### రోకలి బండతో కొట్టి, మెడను కత్తితో నరికి చంపిన ధర్మపత్ని!



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండల కేంద్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటన స్థానికులను షాక్‌కు గురిచేసింది. కుటుంబ కలహాలతో భార్య భర్తలను లేపేసింది. ఈ దిగ్భ్రాంతి కరమైన ఘటన ఇరు కుటుంబాల్లో బాధను మిగిల్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన మల్లయ్య అతని భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తాజాగా కుటుంబ కలహాలు, వాగ్వాదంతో భార్య కోపం తీవ్రరూపం దాల్చింది. దీంతో మొదట రోకలి బండతో భర్త తలపై దాడి చేసినట్లు సమాచారం. అతను నేలకూలగానే, మెడపై కత్తితో నరికి చంపినట్లు తెలిసింది. మల్లయ్య తరచూ మద్యం సేవిస్తూ భార్యను వేధించేవాడని, ఇదే కారణంగా భార్య ఈ దారుణానికి ఒడిగట్టిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మర్డర్‌తో మల్లాపూర్ మండలంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ట్రాఫిక్ చలానాలపై డిస్కౌంట్లు.. హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్ తార్నాకకు చెందిన వి.రాఘవేంద్రాచారి అనే వ్యక్తి బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేసినందుకు విధించిన రూ.1200 జరిమానాను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 1988 మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం ట్రిపుల్ రైడింగ్‌కు కేవలం రూ.100 నుంచి రూ.300 మాత్రమే జరిమానా విధించాల్సి ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2019లో కేంద్రం చేసిన చట్ట సవరణలను తెలంగాణ ప్రభుత్వం ఇంకా అమలులోకి తీసుకురాకపోవడంతో పాత నిబంధనల ప్రకారమే చలానాలు విధించాలని వాదించారు. అంతేకాక, చట్టంలోని ఏ నిబంధన కింద ఉల్లంఘన జరిగింది అనే వివరణ చలానాలో లేకపోవడం కూడా చట్ట విరుద్ధమని తెలిపారు.

అందుకు ప్రతిస్పందనగా.. హోంశాఖ తరఫు న్యాయవాది మహేశ్ రాజె ప్రస్తుత చలానా వ్యవస్థలో చట్ట నిబంధనలతో సహా పూర్తి వివరాలు పొందుపరచడానికి సాంకేతికంగా వీలుకావడం లేదని కోర్టుకు వివరించారు. అయినప్పటికీ, అధికారులు నిబంధనలతో చలానా జారీ చేసే విధంగా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సెక్షన్ 184 కింద జరిమానా రూ.1000 ఉన్నప్పుడు, పిటిషనర్‌కు రూ.1200 ఎలా విధించారనే అంశంపై కూడా లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, తదుపరి విచారణను వాయిదా వేశారు.

## పోలీస్ శాఖకే మచ్చతెచ్చిన ఎస్సై..

### బెట్టింగ్ కోసం ఏకంగా తుపాకీ తాకట్టు..!



**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ పోలీస్ శాఖకు మచ్చతెచ్చే విధంగా అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ భాను ప్రకాశ్ ప్రవర్తించిన తీరు పెద్ద వివాదంగా మారింది. బెట్టింగ్‌లలో బాగా మునిగిపోయి అప్పుల పాలైన భాను ప్రకాశ్, ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు చట్టవిరుద్ధ మార్గాలు ఎంచుకున్నట్టు బయటపడింది. ఓ రికవరీ కేసులో స్వాధీనం చేసిన ఐదు తులాల బంగారాన్ని తన సొంత ప్రయోజనాలకు వాడుకుని పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశాడు. బాధ్యతగా పని చేయాల్సిన స్థానంలో ఉండి నేరాలకు పాల్పడటంతో భాను ప్రకాశ్‌పై పోలీసు శాఖలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అంతేకాదు.. ఎస్సై గన్ మిస్ అయినట్లుగా తోటి సిబ్బంది, ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు నిలదీశారు. కానీ.. ఎస్సై భాను ప్రకాశ్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అయితే, బంగారంతో పాటు తుపాకీని కూడా ఓ బ్రోకర్ వద్ద తాకట్టు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతోనే విధి నిర్వహణలో వాడే గన్‌ను తాకట్టుపెట్టినట్లు సమచారం. ప్రస్తుతం ఎస్సై భాను ప్రకాశ్ టాస్కోఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్నాడు. అతడిని పోలీసులు విచారిస్తున్నారు.

## తెలంగాణలో రహదారుల అభివృద్ధికి బంగారు దశ మొదలైంది : మంత్రి కోమటిరెడ్డి

ధర్వేశిపురం వద్ద ప్రమాదాల నివారణకు ఇప్పటికే 12 కోట్ల వ్యయంతో సీసీ రోడ్, లైటింగ్, మీడియన్ పనులు పూర్తి చేశామని మంత్రి గుర్తుచేశారు. జిల్లాలోని కొత్తపల్లి–ముషంపల్లి సహా అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారంటీల అమలు వేగంగా జరుగుతోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి గ్యారంటీలను ప్రభుత్వం సమగ్రంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. 5 లక్షల రూపాయలతో ఇళ్లు అందజేస్తున్నాం. నల్గొండలో ఇల్లు లేని ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తాం అని ఆయన అన్నారు. అదే విధంగా, ఏఎమ్ఆర్పీ కాలువల లైనింగ్‌కు 450 కోట్ల ఆమోదం, ప్రతి గ్రామానికి రహదారులు–కాలువలు, మహిళలకు రైస్‌మిల్లుల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. డిసెంబర్‌లో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు చీరలు ఇస్తుంటే కేటీఆర్, హరీశ్ రావు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు: సీతక్క

కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు కావాలని చీరలు బాగా లేవంటూ మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలని అవమానించేలా ఉన్నాయన్నారు. చీరలను మహిళా సంఘాల వారికే ఇస్తున్నామని ఆరోపణలు అవాస్తవం అని మహిళా సంఘాల సభ్యులకు ఇస్తూనే సభ్యత్వం లేని వారిని సైతం సంఘంలోకి ఆహ్వానిస్తూ వారికి సారె పెడుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఏం చేసినా బీఆర్ఎస్ నేతలు ఓర్చుకోవడం లేదని ఫ్రీ బస్సు పెడితే బ్రేక్ డాన్స్ చేసుకోవాలని, కొట్టుకుంటున్నారని దుష్ప్రచారం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇకనైనా తమ బుద్ధి మార్చుకుని మహిళలకు మంచి జరుగుతుంటే స్వాగతించడం సంతోషించడం నేర్చుకోలని సూచించారు.

కాగా ఇందిరమ్మ చీరల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. అక్కా చెల్లాల ఆశీస్సులు ఉన్నంతకాలం మన ప్రభుత్వంని బీఆర్ఎస్ ఏం చేయబోదని అధికార కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తుంటే ఇచ్చిన అసలు హామీలు పక్కన పెట్టి చీరలు పంచుతూ ప్రజల దృష్టిని మళ్లిస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.

## జీవో 46 రద్దు చేయాలని ట్యాంక్‌బండ్‌పై బీసీల ఆందోళన

ఈ ఆందోళన కారణంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన పోలీసులు, నిరసనకారులను అదుపులోకి తీసుకుని అక్కడ నుంచి తరలించడంతో ట్రాఫిక్ సాధారణ స్థితికి వచ్చింది.

ఇదిలా ఉండగానే మరో బృందం నేరుగా గాంధీ భవన్ ముట్టడికి ప్రయత్నించారు. జీవో నెంబర్ 46 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. గాంధీ భవన్ లోకి దూసుకెళ్లేందుకు బీసీ సంఘం నేతలు ప్రయత్నించారు. ఇది గమనించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు, బీసీ నేతల మధ్య తోపులాట జరగ్గా.. అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు వాహనంలో ఎక్కించి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన జూబ్లీహిల్స్ శాసనసభ్యుడిగా (ఎమ్మెల్యే) వి. నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ సమక్షంలో నవీన్ యాదవ్ శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం నవీన్ యాదవ్ స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్ యాదవ్‌కు మద్దతుగా పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, అనుచరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు గుడ్ న్యూస్..

### సీసీఐకి అధికారులకు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** పత్తి రైతులకు తీపికబురు అందింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రాష్ట్రంలో మరో 14 జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోళ్లను సీసీఐ అధికారులు ప్రారంభించారు. మిగిలిన జిన్నింగ్ మిల్లులను కూడా త్వరగా ప్రారంభించాలని మంత్రి సీసీఐ అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది అధిక జిన్నింగ్ మిల్లులను ప్రారంభించామని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.63 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి సేకరించామని తెలిపారు.

## ప్రజా పోరాటాలతో మీకు బుద్ధి చెప్తాం.. సర్కారుపై తెలంగాణ జాగృతి చీఫ్ కవిత ఫైర్



ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ బోర్డు నిర్ణయాన్ని తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. గతంలో తాము అధికారులను ఒప్పించి 85 శాతం వరకు అన్‌ఫిట్ చేయించామని గుర్తు చేశారు. మిగతా వారిని కూడా మళ్లీ మళ్లీ మెడికల్ బోర్డుకు తీసుకొచ్చి అన్‌ఫిట్ అయ్యేలా కృషి చేశామని అన్నారు. సింగరేణి సంస్థ కొనసాగాలనే ఉద్దేశంతోనే డిపెండెంట్ ఉద్యోగాలు ఉండాలని పోరాడామన్నారు. నడ్డి విరిచే దాకా సింగరేణి కోసం పని చేసిన కార్మికుని బిడ్డలకు భరోసా ఉండాలని కృషి చేశామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కిందని ఆమె ఆరోపించారు. సింగరేణి మీద కనీసం ప్రేమ లేకుండా కేవలం 18 శాతం మందికే అన్‌ఫిట్ చేయడం చాలా అన్యాయమని తెలిపారు.

గతంలో కూడా 54 మందితో మెడికల్ బోర్డు పెట్టారని.. అందులో తీవ్రమైన అన్యాయం చేస్తూ నలుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేశారని ఆమె ఆరోపించారు. మిగతా 50 మందిని ఎందుకు మెడికల్ బోర్డుకు పిలవలేదని ప్రశ్నించారు. తక్షణమే వారిని కూడా అన్‌ఫిట్‌కు పిలవాలని డిమాండ్ చేశారు. ఎవరైతే తమ పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని భావిస్తున్నారో వారికి ఇవ్వడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కానీ, ఆ ఉద్యోగాలను ఇవ్వకుండా ఆపేందుకు రేవంత్ సర్కార్ పని చేస్తోందని.. తీరు మారకపోతే మళ్లీ ప్రజా పోరాటాలతో వారికి బుద్ధి చెప్తామని కవిత హెచ్చరించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం అటకెక్కలేదు: మహేశ్ కుమార్ గౌడ్

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేయని ప్రయత్న అంటూ లేదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామని అయితే హైకోర్టు ఆదేశాల మేరకే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరుగుతోందన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం రెండు బిల్లులు ఆమోదిస్తే వాటిని గవర్నర్ ఆమోదించలేదని దాంతో ఆర్డినెన్స్ తెస్తే దాన్ని కూడా గవర్నర్ పెండింగ్ లో ఉంచారని చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో మా ప్రయత్నానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోకాలడ్డుతోందని విమర్శించారు. ఇవాళ ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన.. 42 శాతం రిజర్వేషన్లు అటకెక్కినట్లు బీసీ సంఘాలు భావిస్తున్నాయి. కానీ అలాంటి అపోహలకు అవకాశం లేదన్నారు. 90 శాతం సర్పంచ్ లు కాంగ్రెస్ కు చెందిన వ్యక్తులే ఎన్నిక అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకే కులగణన చేశామన్నారు. దీని ద్వారా బీసీ జనాభా 56.7 శాతం అని తేల్చామన్నారు.

## వారికి ఆ విషయం తెలియకపోవచ్చు..

### ఆర్టీసీలో టికెట్ ధరల పెంపు ప్రచారం పై అధికారిక వివరణ

ఇంధన ధరలు పెరిగినప్పుడల్లా, టీజీఎస్ఆర్టీసీ ధరల పెరుగుదలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాస్తాం. కానీ చాలా సందర్భాల్లో, టికెట్ ధరల పెంచడం వల్ల ప్రయాణికులకు కలిగే ఆసౌకర్యాని దృష్టిలో ఉంచుకుని ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తాం. కాకపోతే, టికెట్లపై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వసూలు చేస్తున్నా విషయం చాల కాలం తరవాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి తెలియకపోవచ్చు అని నాగిరెడ్డి తెలిపారు' అంటూ టీజీ ఫ్యాక్ట్ చెక్ వివరణ ఇచ్చింది.

దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ధరల పెంపును మీరు సెస్ అని పిలవండి లేదా ఇంకేమైనా పిలవండి. కానీ ప్రజలమ మీద భారం పడుతోందా లేదా అని ఓ నెటిజన్ ప్రశ్నించారు. మరో నెటిజన్ రియాక్ట్ అవుతూ.. నిన్న పెంచామా మొన్న పెంచామా అన్నది కాదు టికెట్ ధరలు పెరిగాయనేది జనాల బాధ అని కామెంట్ చేశారు.

## ఎవరి ప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీ విస్తరణ.. ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఎవరి ప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీ విస్తరణకు నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇవాళ వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ విస్తరణకు గ్రేటర్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, మున్సిపాలిటీల అభిప్రాయం అక్కర్లేదా అని మండిపడ్డారు. పెద్ద పెద్ద మాల్స్ కట్టుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకే భూమిని ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్క్‌తో 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. త్వరలో రెండు, మూడు కంపెనీలు కూడా ఉత్పత్తిని ప్రారంభించబోతున్నాయని తెలిపారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని ఫైర్ అయ్యారు. గతంలో 24 శాతం ఉన్న రిజర్వేషన్లు 17 శాతానికి తగ్గాయని ఎద్దేవా చేశారు. కొన్ని మండలాల్లో దారుణంగా ఒక్క గ్రామానికి కూడా బీసీ రిజర్వేషన్లు దక్కలేదన్నారు. పార్టీ రహితంగా జరిగే ఎన్నికల్లో.. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని మోసం కాకపోతే ఇంకేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎవరి ప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీ విస్తరణ.. ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఎవరి ప్రయోజనాల కోసం జీహెచ్ఎంసీ విస్తరణకు నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ విస్తరణకు గ్రేటర్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, మున్సిపాలిటీల అభిప్రాయం అక్కర్లేదా అని మండిపడ్డారు. పెద్ద పెద్ద మాల్స్ కట్టుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకే భూమిని ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్క్‌తో 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. త్వరలో రెండు, మూడు కంపెనీలు కూడా ఉత్పత్తిని ప్రారంభించబోతున్నాయని తెలిపారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని ఫైర్ అయ్యారు. గతంలో 24 శాతం ఉన్న రిజర్వేషన్లు 17 శాతానికి తగ్గాయని ఎద్దేవా చేశారు. కొన్ని మండలాల్లో దారుణంగా ఒక్క గ్రామానికి కూడా బీసీ రిజర్వేషన్లు దక్కలేదన్నారు. పార్టీ రహితంగా జరిగే ఎన్నికల్లో.. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని మోసం కాకపోతే ఇంకేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నగరంలో ఫేక్ ఐఏఎస్ అధికారి అరెస్ట్ బాధితుల నుంచి రూ.10 లక్షలు వసూలు

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఓ వైపు రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు ప్రజల జేబులు గుల్ల చేస్తుంటే మరోవైపు కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఇవాళ నగరంలోని ఫిల్మ్‌నగర్ పరిధిలో ఫేక్ ఐఏఎస్ ఆఫీసర్ గా చలామణి అవుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్ పరిధిలో నివాసం ఉంటున్న శశికాంత్ అనే వ్యక్తి తనకు తానుగా ఐఏఎస్ అని చెప్పుకుంటూ హల్‌చల్ చేస్తున్నాడు. ఏకంగా ఇద్దరు గన్‌మెన్లు, ఫేక్ ఐడీ కార్డులను పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. నగర శివార్లలో నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్ల వద్దకు వెళ్లి బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని బాధితుల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే ఓ బాధితుడు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చిందు. అసలు అతడు ఐఏఎస్ ఆఫీసరే కాదని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## మాదాపూర్‌లో బోర్డు తిప్పేసిన మరో ఐటీ కంపెనీ రోడ్డున పడ్డ 400 మంది

**న్యూస్ డెస్క్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** మాదాపూర్‌లో మరో ఐటీ కంపెనీ బోర్డు తిప్పేసిన ఘటన వెలుగు చూసింది. ఈ ఘటన ప్రస్తుతం ఐటీ కారిడార్‌లో కలకలం రేపుతోంది. స్థానికంగా పేరొందినట్టు నటిస్తూ కార్యకలాపాలు నిర్వహించిన NSN ఇన్ఫోటెక్ ఘరానా మోసం బయటపడింది. శిక్షణ, ఉద్యోగ అవకాశం పేరుతో 400 మందికి పైగా నిరుద్యోగుల దగ్గర నుంచి మూడు లక్షల వరకు వసూలు చేసినట్టు బాధితులు చెబుతున్నారు. ఐటీ కంపెనీ అని నమ్మించి, ఉద్యోగం ఖాయం అని మాటలు చెప్పి భారీగా డబ్బులు తీసుకున్నారని తెలుస్తోంది.

కంపెనీ యజమాని స్వామి నాయుడు ఈ మొత్తం మోసానికి మాస్టర్‌మైండ్‌గా గుర్తించారు. తాను ప్రైవేట్ ఛానల్ యజమాని అని చెప్పుకుని, నకిలీ ప్రతిష్టను సృష్టించి యువతను నమ్మించి టోకరా వేసినట్టు బాధితులు తెలిపారు. ప్రస్తుతం స్వామి నాయుడు పరారీలో ఉండగా, మోసపోయిన వారు సైబరాబాద్ కమిషనరేట్‌లోని EOW (ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్) వద్ద ఫిర్యాదులు చేశారు. కంపెనీ ఆఫీసు ముందుకెళ్లిన బాధితులకు బోర్డు తిప్పేయబడిన ఖాళీ కార్యాలయం మాత్రమే కనిపించడంతో మోసం విషయం స్పష్టమైంది. ఈ ఘటనతో మాదాపూర్ ఐటీ ప్రాంతంలో కలకలం చెలరేగింది. యువతకు ఉద్యోగాల పేరిట మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రాజ్యాంగం సాక్షిగా కాంగ్రెస్ మోసం

● పదవుల కోసమే కాంగ్రెస్ నేతల ప్రమాణాలు ● మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** భారతదేశానికి దిశానిర్దేశం చేస్తూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా సర్వజన ఆమోదయోగ్యమైన అద్భుత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాల కో-ఇన్చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి కొనియాడారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని గ్రైన్ మార్కెట్ అంబేద్కర్ కాలనీలో ఉన్న బాబాసాహెబ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొంగులేటి ప్రసంగిస్తూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు , పాలకుల తీరుపై తీవ్ర స్థాయిలో స్పందించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు, అధికారం పొందిన కాంగ్రెస్ మంత్రులు , నాయకులు నేడు అంబేద్కర్ స్ఫూర్తిని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. అధికారం లేనప్పుడు రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడిన వారు, ఇప్పుడు పదవుల్లో కూర్చొని రాజ్యాంగ విలువల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించడం శోచనీయమని, కేవలం ఓట్ల కోసమే అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పాలకులే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నడుచుకుంటే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తోందని పొంగులేటి సుధాకర్ రెడ్డి వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, దేశ చరిత్రలోనే తొలిసారిగా సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన ఒక గిరిజన మహిళ, ద్రౌపది ముర్మును దేశ అత్యున్నతమైన రాష్ట్రపతి పీఠంపై కూర్చోబెట్టి బీజేపీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని చాటిచెప్పిందని గుర్తుచేశారు. ఇది కేవలం ఒక పదవిని ఇవ్వడం మాత్రమే కాదని, అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు దక్కిన నిజమైన గౌరవమని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్ ను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేస్తే, బీజేపీ ప్రభుత్వం ఆయనను గౌరవిస్తూ నవంబర్ 26 ను అధికారికంగా 'రాజ్యాంగ దినోత్సవం'గా ప్రకటించి దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. అంతేకాకుండా, అంబేద్కర్ జీవితంతో ముడిపడి ఉన్న ఐదు ప్రధాన పవిత్ర ప్రదేశాలైన జన్మభూమి (మహౌ), శిక్షా భూమి (లండన్), దీక్షా భూమి (నాగ్ పూర్), మహా పరినిర్వాణ భూమి (ఢిల్లీ), చైత్య భూమి (ముంబై) లను 'పంచ తీర్థాలు'గా అభివృద్ధి చేసి భావితరాలకు ఆయన చరిత్రను అందిస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని పొంగులేటి స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్ లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా దేశమంతటా 'ఒకే రాజ్యాంగం – ఒకే చట్టం' అమలు అయ్యేలా చేసి అంబేద్కర్ కోరుకున్న నిజమైన జాతీయ సమైక్యతను సాధించామని గుర్తు చేశారు. 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్' నినాదంతో ప్రతి పేదవాడికి ఇళ్లు, ఉచిత రేషన్, మరుగుదొడ్లు వంటి సంక్షేమ పథకాలను అందిస్తూ అంత్యోదయ స్ఫూర్తితో పాలన సాగిస్తున్నామని వివరించారు. చివరగా, దేశంలోని ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఫలాలను అందుకోవాలని, అప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని పొంగులేటి ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని పీఠిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక బాధ్యతలపై ప్రజలకు, యువతకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమాజంలో వేళ్ళూనుకుపోయిన వరకట్నం వంటి దురాచారాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కుల, మత, వర్గ విభేదాలు లేని నవ సమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ కలలు కన్నారని, ఆ ఆశయ సాధన కోసం ప్రతి పౌరుడు పాటుపడాలని కోరారు. కార్యక్రమం ముగింపులో రాజ్యాంగ పరిరక్షణకు, దేశ సమగ్రతకు కట్టుబడి ఉంటామని నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి పొంగులేటి సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు సన్నీ ఉదయ్ ప్రతాప్, మండడపు సుబ్బారావు, చిలివేరి రమేష్, నున్నా రవి కుమార్, నాయుడు రాఘవరావు, గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్,పెరుమాళ్ళ విజయ రాజు, నరుకుల వెంకటేశ్వర్లు,మంద సరస్వతి, వీరెల్లి రాజేష్, కందుల శ్రీకృష్ణ, ఆర్ వి ఎస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి సుడిగాలి పర్యటన





**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలతో పాటు, పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**కోటి రూపాయల అభివృద్ధికి అంకురార్పణ:** ఖమ్మం నగరంలోని 60వ డివిజన్ రామన్నపేటలో రూ. కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు.

**వివాహ వేడుకలకు హాజరు:** మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి మధిర పట్టణంలో వేమి రెడ్డి శ్రీనివాస రెడ్డి కుమార్తె వివాహానికి, ఖమ్మం నగరంలోని పుట్టకోటలో ఇరకబోయిన ముక్కంటి కుమారుని వివాహానికి, అలాగే చర్చి కాంపౌండ్, శ్రీరామ్ హిల్స్ ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ రెడ్డిపల్లిలో పాపిట్ల శ్రీను కుమారుని, చెన్నబోయిన శ్రీను కుమార్తెల వివాహాలకు హాజరయ్యారు. కూసుమంచి మండలంలో కొత్తపల్లి మల్లయ్య, గోపె పెద్ద వెంకన్న కుమారుల, రాము కుమార్తె వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**పలు కుటుంబాలకు సానుభూతి:** మధిర మండలం దిడుగుపాడు గ్రామంలో ఇటీవల మరణించిన యన్నం కోటేశ్వరరావు తండ్రి కుటుంబాన్ని, వైరా పట్టణ కేంద్రంలో చనిపోయిన చింతనిప్పు సుధాకర్ కుటుంబాన్ని, అలాగే పోలా శ్రీను అమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

**డీసీసీ అధ్యక్షురాలికి అభినందన:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా నియమితులైన తోట దేవి ప్రసన్న కూసుమంచిలో మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను అభినందించారు.



# రైతు కంట కన్నీరు...రేవంత్ సర్కార్‌కు పెనుముప్పు

## మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆగ్రహం



**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో అన్నం పెట్టే రైతన్న ఆవేదనలో కూరుకుపోతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ కాలం గడుపుతోందని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ దగ్గర బీజేపీ , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతు దీక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సాక్షిగా ప్రమాణం చేసిన పాలకులు, నేడు రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని ఆయన మండిపడ్డారు. బాబాసాహెబ్ ఆశయాలకు విరుద్ధంగా పాలన సాగిస్తూ, రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అన్నదాతల ఉసురు పోసుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని, గతంలో కేసీఆర్ సర్కార్ కూడా రైతులను మోసం చేసే కుప్పకూలిందని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పు చేస్తూ పతనానికి బాటలు వేసుకుంటోందని, రైతుల జోలికొస్తే కాంగ్రెస్ పార్టీకి కూడా కేసీఆర్ గతే పడుతుందని ఆయన జోస్యం చెప్పారు.

**ఆర్థిక గణాంకాల గారడీ.. హామీల అమలులో డొల్లతనం:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేదని పొంగులేటి సుధాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి నెలకు 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని గొప్పలు చెబుతున్న సీఎం, అందులో 14 వేల కోట్లను కేవలం ఉద్యోగుల జీతాలకు, గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలకే వెచ్చిస్తున్నారని గణాంకాలతో సహా వివరించారు. ఇక మిగిలిన అరకొర 4 వేల కోట్లతో రైతులకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా వంటి భారీ పథకాలను ఎలా అమలు చేస్తారని ఆయన సర్కారును సూటిగా ప్రశ్నించారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఆరు గ్యారెంటీలు ఎలా నెరవేరుస్తారని నిలదీశారు. కేవలం మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ, హామీల అమలును అటకెక్కించారని, ఇది ముమ్మాటికీ రైతులను వంచించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సినీ ఫక్కీలో సర్కార్ తీరు – 'కోట' పాత్రతో ఎద్దేవా:** రాష్ట్ర ప్రభుత్వ పనితీరును వివరిస్తూ బీజేపీ నేతలు 'అహ నా పెళ్లంట' సినిమాలోని కోట శ్రీనివాసరావు పాత్రతో పోల్చి చేసిన వ్యాఖ్యలు సభలో ఆలోచింపజేశాయి. సినిమాలో పిసినారి పాత్రధారి ప్లేటులో అన్నం లేకుండా కేవలం కోడిని చూపించి కడుపు నింపుకోమన్నట్లుగా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్లు భ్రమ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో పథకాలు అందకపోయినా, పేపర్లలో మాత్రం ప్రకటనలు గుప్పిస్తూ సినిమా చూపిస్తున్నారని సెటైర్లు వేశారు. ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టే రోజులు పోయాయని, రైతులు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**కేంద్రం సహకారం ..రాష్ట్ర సర్కార్ వైఫల్యం**

**కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి.**

వ్యవసాయ రంగానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ కేంద్రంపై నిందలు వేస్తోందని కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగా, సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి మంజూరు చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ వ్యవస్థలోని లోపాల వల్ల రైతులు ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్లలో పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా రూ. 6,000 నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తూ మోదీ భరోసా ఇస్తుంటే, రేవంత్ సర్కార్ మాత్రం రైతు బంధు (రైతు భరోసా) ఇవ్వకుండా దాటవేస్తోందని విమర్శించారు.

ఖమ్మం జిల్లాలో ప్రధానంగా ధాన్యం, పత్తి కొనుగోళ్లలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యంగా మారిందని నేతలు ఆరోపించారు. సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం పేరుతో, తాలు పేరుతో మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కి రూ. 500 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమేనంటూ మెలికలు పెట్టి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ పేరుతో కొందరికి మాత్రమే లబ్ధి చేకూర్చి 'మామా' అనిపించుకున్నారని, మిగతా మెజారిటీ రైతులను దగా చేశారని, బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని విమర్శించారు.

**రియల్ ఎస్టేట్ దందా**

ఫ్యూచర్ సిటీ స్కామ్ ఆరోపణలు

బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు.

కాంగ్రెస్ పాలకులు ప్రజా సేవను వదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారమెత్తారని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు ఆరోపణ చేశారు. 'ఫ్యూచర్ సిటీ' పేరుతో పారిశ్రామికవేత్తలకు విలువైన భూములు కట్టబెడుతూ సుమారు 6 లక్షల కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. పేదలకు ఇవ్వాల్సిన భూములను లాక్కుని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు గ్రామాల్లో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని, సర్పంచులకు నిధులు ఇవ్వకపోవడంతో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా నాసిరకంగా సాగుతోందని, పక్క జిల్లాలో గోడ కూలితే ఇల్లు మొత్తం కుప్పకూలిన ఘటనలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనదని, ఇక్కడి నుండే ఉప ముఖ్యమంత్రితో పాటు మరో ఇద్దరు కీలక మంత్రులు ఉన్నప్పటికీ, రైతుల బతుకులు మాత్రం మారలేదని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత జిల్లాలో రైతులు



కన్నీరు పెడుతుంటే మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మార్కెట్ యార్డు సాక్షిగా గతంలో బీఆర్ఎస్ హయాంలో రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర ఉందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తూ రైతులపై కేసులు పెడుతోందని ఆరోపించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే భూ సేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా మంత్రులు తక్షణమే నిద్ర మేల్కొని రైతుల సమస్యలు పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు.

**రైతు దీక్షలో కోడు వెళ్లవచ్చుకున్న రైతులు:** ఈ కార్యక్రమం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, రైతుల కష్టసుఖాలను పంచుకునే రైతు దీక్ష సాగింది. ముఖ్యంగా వేదికపైకి రైతులైన పుల్లయ్య, వెంకట్, కిరణ్, వీరస్వామి, వెంకట నారాయణ, రాములు, గోపి (రామవరం), బాలకృష్ణ, రమేష్ గుప్తా, ప్రసాద్, సుబ్బారావు, చింతకాని రామారావు, భద్రం , కృష్ణ తదితరులను సాదరంగా ఆహ్వానించి, వారు పడుతున్న బాధలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు రేవంత్ రెడ్డి పాలనలో పడుతున్న కష్టాలను దీక్షలో తెలియజేశారు. రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంట నష్టపరిహారం, పత్తి కొనుగోలలో నష్టాలు తైతరాంశాలు స్థానిక నేతలకు వివరించారు. ఈ రైతు దీక్షలో నాయకులు సన్నీ ఉదయ్ ప్రతాప్, మండడపు సుబ్బారావు, చిలివేరి రమేష్, నున్నా రవి కుమార్, నాయుడు రాఘవరావు, గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్,పెరుమాళ్ళ విజయ రాజు, నరుకుల వెంకటేశ్వర్లు,మంద సరస్వతి, వీరెల్లి రాజేష్, కందుల శ్రీకృష్ణ, ఆర్ వి ఎస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ స్ఫూర్తిని విస్మరించారు..!

## ▶▶ ఓటు బ్యాంకు రాజకీయాలకు 'సలాం' కొట్టారు! ▶▶ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** దేశాన్ని ఏకం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన 'యూనిటీ ఆఫ్ మార్చ్' (ఐక్యతా పరుగు) కార్యక్రమానికి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మొహం చాటేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని బీజేపీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఖమ్మం బిజెపి జిల్లా కార్యాలయం లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక పార్టీ కార్యక్రమం కాదని, దేశవ్యాప్తంగా పార్టీలకతీతంగా జరుగుతున్న జాతీయ కార్యక్రమమని గుర్తుచేశారు.

**ఓటు బ్యాంకు కోసమే పటేల్‌కు అవమానం?:** "జిల్లాలో మంత్రులు, అధికార యంత్రాంగం ఉండి కూడా యూనిటీ ఆఫ్ మార్చ్‌కు రాకపోవడం ఆశ్చర్యాన్ని, ఆవేదనను కలిగిస్తోంది. మజ్లిస్ పార్టీకి భయపడి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నేతలు పటేల్ గొప్పతనాన్ని గుర్తించడం లేదు," అని పొంగులేటి విమర్శించారు. దేశవ్యాప్తంగా వందేమాతరం గీతాన్ని గౌరవిస్తుంటే, తెలంగాణలో మాత్రం మజ్లిస్ మెప్పు కోసం దానిని పక్కన పెడుతున్నారని పరోక్షంగా చురకలు అంటించారు. రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) వేళ.. రాజ్యాంగ నిర్మాతలను, దేశ సమైక్యతా మూర్తులను విస్మరించడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమన్నారు. తనకు ప్రొటోకాల్ ఇవ్వకపోయినా ఫర్వాలేదు కానీ, జాతీయ కార్యక్రమాలను అవమానించడం తగదని హితవు పలికారు.

**"ఫ్యూచర్ సిటీ" వెనుక భూముల కుంభకోణం?:** రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి, "ఫ్యూచర్ సిటీ" వంటి ఆకర్షణీయమైన పేర్లతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని పొంగులేటి సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలోని వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను.. "పబ్లిక్ యుటిలిటీ" పేరుతో 'ల్యాండ్ యూజ్' మార్చడానికి తెరవెనుక భారీ స్కెచ్ వేశారని ఆరోపించారు. "అసలు ఈ భూముల మార్పిడి ఎవరి కోసం? దీని వెనుక ఉన్న పెద్దలు ఎవరు? ప్రభుత్వం వెంటనే దీనిపై 'శ్వేతపత్రం' విడుదల చేయాలి," అని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తిని కాపాడేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అల్టిమేటం జారీ చేశారు.

**అప్పుల ఊబిలో తెలంగాణ:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ పొంగులేటి కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. నెలకు వచ్చే రూ. 18,000 కోట్ల ఆదాయంలో.. రూ. 13,000 కోట్లు కేవలం పాత అప్పుల వడ్డీలు, కిస్తీలు కట్టడానికే పోతున్నాయని గణాంకాలతో వివరించారు. ఉద్యోగుల జీతాలకు కూడా నిధులు లేని పరిస్థితి నెలకొందని, ఏడాదిలోనే రూ. 3 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**స్థానిక సంస్థల్లో బీసీలకు తీరని ద్రోహం:** పంచాయతీ ఎన్నికల నిర్వహణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ప్రభుత్వం ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. బీసీ జనాభా ఎక్కువగా ఉన్న చోట్ల కూడా ఒక్క సర్పంచ్ స్థానం కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎలాంటి శాస్త్రీయత లేకుండా, హడావిడిగా ఎన్నికలకు వెళ్తూ బీసీల గొంతు కోస్తున్నారని విమర్శించారు.

**రైతు గోస - ప్రచార ఆర్భాటం:** రైల్వే స్టేషన్ల సుందరీకరణ (అమృత్ భారత్), ఎరువుల సబ్సిడీ వంటివి కేంద్ర నిధులతో జరుగుతుంటే.. స్థానిక కాంగ్రెస్ నేతలు తామే చేసినట్లు స్టిక్కర్లు వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతు రుణమాఫీ పూర్తి కాలేదని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని, ధాన్యం కొనుగోళ్లలో బోనస్ ఊసే లేదని ఆరోపించారు.

సత్తుపల్లిలో న్యాయం కోసం పోరాడుతున్న గిరిజన, బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు బనాయించడంపై పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పొంగులేటి సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మీడియా సమావేశంలో నాయకులు ఇవి రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్, సుదర్శన్ మిశ్రా, నున్న రవికుమార్, సైదేశ్వరరావు, వీరెల్లి రాజేష్, నెల్లూరి బెనర్జీ, సురేందర్ రెడ్డి, వీరంరాజు, రజినీ రెడ్డి, దొడ్డా అరుణ, మనీ, తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలను నిస్సారం చేయొద్దు

## జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** పంట పొలాల్లో పత్తి, వరి కొయ్యలను తగులబెట్టి సారవంతమైన భూమిని నిస్సారం చేయొవద్దని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య రైతులకు సూచించారు. ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, చింతగుర్తి, పరికలబోడుతండాలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. సాగుచేసిన పొలంలో వ్యర్థాలను తగులబెడుతున్న రైతులకు అవగాహన కల్పించారు. ఇలా చేయడం వలన భూమిలో పంటలకు మేలు చేసే బాక్టీరియా నశించిపోతుందని, తద్వారా పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. అనంతరం పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. వర్షాలకు పత్తి దెబ్బతిని పోయిందంటూ రైతులు ఆయనకు ఎకరువు పెట్టారు. మిర్చిపై తక్కువ ఫెస్టిసైడ్స్ వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమమంలో ఆయన వెంట ఏఈఓ బాలబత్తుల శిరిణ్మయి తదితరులు పాల్గొన్నారు.





# నవంబర్ 30న జిల్లా కమిటీ విస్తృత సమావేశాలు





**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఈనెల 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియస్ యుటిఎఫ్) జిల్లా కమిటీ విస్తృత సమావేశాలు కల్లూరు నందు జరుగుతున్నాయని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విస్తృత సమావేశాల పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సత్తుపల్లి శాసనసభ సభ్యులు మట్టా. రాగమయి దయానంద్, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం. వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా. దుర్గాభవాని తదితరులు హాజరవుతారని తెలియజేశారు. విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, కార్యచరణ రూపొందిస్తామని కావున ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, షమీ, కోశాధికారి వల్లంకొండ. రాంబాబు, జిల్లా కార్యదర్శులు పి. సురేష్, ఉద్దండ్ షరీఫ్,రాందాస్, నాగేశ్వరరావు, నర్సయ్య, పద్మ,సుధాకర్ ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ ల గెజిట్స్ ను రద్దు చేయాలి



**ఖమ్మం బ్యూరో, 26 నవంబర్ (కెరటం న్యూస్):** ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం లో నిరసన బ్యాడ్జీలు ఆర్టీసీ కార్మికుల శ్రమను దోచుకునే పని గంటల పెంపుదల కోసం కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా రూపొందించి వాటి అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు ఖమ్మం డిపో వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్లు రద్దు చేయాలి, విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీలకే ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి 2025 ని రద్దు చేయాలి టీ జి ఎస్ ఆర్ టి సి లో కార్మిక సంఘాల పై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు ఎన్నికలు సిసిఎస్ కు ఎన్నికలు జరపాలి. రిటైర్ అయిన కార్మికులకు రావలసిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలి. 2021, 2025 వేతన ఒప్పందాలను చేయాలి, 2017 అలవెన్సులు సవరించాలి, కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అని డిమాండ్ చేస్తూ డిమాండ్ డే బ్యాడ్జీలు పెట్టుకొని డ్యూటీలకు హాజరవుతున్న ఖమ్మం డిపో కార్మికులు.

# మెగా ఛాన్స్ కొట్టేసిన 'రాజు వెడ్స్ రాంబాయి' టీం..




మూవీ న్యూస్, 26 నవంబర్ (కెరటం న్యూస్): తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా దూసుకెళ్తున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి' ఇప్పుడు మరొక కారణంతో కూడా వార్తల్లో నిలుస్తోంది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ లవ్ స్టోరీ మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో సాలిడ్ కలెక్షన్లు అందుకుంటోంది. సక్సెస్ సెలబ్రేషన్స్ మొత్తానికి మూడింతలు పెరిగిపోయేలా ఒక స్పెషల్ గెస్ట్ ఈవెంట్‌లో హాజరయ్యాడు. అదీ యంగ్ అండ్ మాస్ డైరెక్టర్ కొల్లి బాబీ.

సక్సెస్ మీట్‌కు హాజరైన కొల్లి బాబీ, అక్కడే ఒక మెగా ఛాన్స్ ప్రకటించడం ఈవెంట్ హైలైట్‌గా మారింది. తాను చేయబోయే మెగాస్టార్ చిరంజీవి 158 వ సినిమా కోసం 'రాజు వెడ్స్ రాంబాయి' టీమ్‌కు పెద్ద ఆఫర్ ఇచ్చారు. సినిమాలో సాహిత్యాన్ని రాసిన రచయితకు, అలాగే డైరెక్టర్ బోస్‌కు కూడా తన ప్రాజెక్ట్‌లో అవకాశం ఇస్తానని ప్రకటించేశారు. అంతేకాదు, దర్శకుడు బోస్ చెప్పినట్లు, తాను మెగాస్టార్‌తో ఒక చిన్న సీన్‌లో అయినా నటించాలనే కోరికను బాబీ వెంటనే అంగీకరించడంతో ఆ క్షణం ఫ్యాన్స్‌లో వైరల్ అయ్యిపోయింది. ఈ విధంగా, కేవలం మంచి సినిమా తీసినందుకు మాత్రమే కాకుండా, మెగా క్యాంప్ గమనానికి కూడా 'రాజు వెడ్స్ రాంబాయి' టీమ్ వచ్చేశారని చెప్పవచ్చు. సాహిత్య రచయిత నుండి దర్శకుడు వరకు, ఈ చిత్ర యూనిట్ కీలక సభ్యులు ఇప్పుడు మెగాస్టార్ 158వ సినిమా టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఒక చిన్న సినిమాకు వచ్చిన ఈ మెగా ఆఫర్ ఇప్పుడు వారి కెరీర్ గ్రాఫ్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్తుందనడంలో సందేహమే లేదు.

# నేను కూడా పైరసీ చూస్తా

## - ఆర్జీవీ షాకింగ్ స్టేట్‌మెంట్ వైరల్ !

**మూవీ న్యూస్, 26 నవంబర్ (కెరటం న్యూస్):** రామ్‌గోపాల్ వర్మ ఎక్కడ కనిపించినా వార్తే.. ఆయన ఏ మాట అన్న వివాదమె.. ఇండస్ట్రీకి కూడా ఇది అలవాటు అయిపోయింది. ఒక్కప్పుడు తన సినిమాలతో ప్రేక్షకులో తనకంటూ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న వర్మ.. ఈ మధ్య మాత్రం సినిమాల కంటే ఎక్కువగా తన కామెంట్స్, సోషల్ మీడియా పోస్టుల వల్లే హాట్ టాపిక్ అవుతున్నారు. ఇక తాజాగా పైరసీపై నడుస్తున్న పెద్ద చర్చకి ఆర్జీవీ చేసిన కామెంట్స్ మరింత పెట్రోల్ పోసినట్టు అయ్యాయి. ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటనతో పైరసీ మళ్లీ హాట్ టాపిక్ అయ్యింది. అదే సమయంలో ఓ ఇంటర్వ్యూలో వర్మ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.

"నాకు ఆసక్తి ఉన్న సినిమానే థియేటర్‌లో చూస్తా. ఆసక్తి లేకపోతే నేరుగా పైరసీలో చూస్తా. వాళ్ల కలెక్షన్‌ల గురించి నేనెందుకు ఆలోచించాలి?" అంటూ వర్మ మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇక అంతటితో ఆగకుండా.. " ఏది తక్కువలో దొరుకుతుందో అదే చూస్తారు. ఆడియన్స్ మెంటాలిటీ అలాంటిది.. టెక్నాలజీ ఉన్నంత కాలం పైరసీని ఆపడం అసంభవం. సినిమా వాళ్లే తప్ప ఆడియన్స్‌ను ఏమాత్రం తప్పుబట్టలేరు" అని అన్నారట.

పైరసీ వల్ల నిర్మాతలు పడుతున్న నష్టాల గురించి మాట్లాడుతూ.. "పైరసీని ఆపితే మీకు వచ్చే డబ్బుల్లో కొంచెం ఎక్కువే వస్తాయి. అంతకంటే పెద్ద నష్టం ఏమీ లేదు. మీరు మాత్రం రెమ్యునరేషన్‌లు పెంచేసుకుని, ఆ డబ్బుల్ని ప్రేక్షకుల జేబుల నుంచి రాబట్టుకోవడం సరి కాదు" అని నేరుగా చెప్పేశారట. వర్మ వ్యాఖ్యలపైన సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కొంతమంది.. 'ఇండస్ట్రీలో ఉన్న మనిషి ఇలా మాట్లాడటం ఏమిటి?' అని విమర్శిస్తుంటే.. మరికొందరు మాత్రం 'ఇది వర్మ స్టైల్ అతను మాట్లాడేదంతా స్ట్రైట్‌ఫార్వడ్‌గానే ఉంటుంది' అని ఫన్‌గా తీసుకుంటున్నారు.